క్లుప్తంగా

5న జిల్లా స్థాయి టాలెంట్ టెస్టు

సారవకోట: ఈ నెల 5న మండలంలోని అలుదు విజయాంబికా యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు చలా ఆనందరావు గురువారం తెలిపారు. వివేకానంద జయంతి, సంఘం రజతోత్సవం పురస్కరించుకుని 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సైన్స్, సోషల్, గణితం, జనరల్ నాలెడ్జ్ సబ్జెక్టులపై 100 మార్కులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో ఈ టాలెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేరోజు జూనియర్, సీనియర్ విభాగంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు 4వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 10న రుద్రపంక్తి విజయ్‌కుమార్ జ్ఞాపకార్థం జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు ఈ నెల 9వ తేదీలోగా 9704715741, 9550918900 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నువ్వు విత్తనాలు సిద్ధం


మాట్లాడుతున్న ఏవో సునీత

నరసన్నపేట: రబీలో నువ్వు పంట వేసేందుకు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైన రైతులు సంబంధిత వీఏఏలను సంప్రదించవచ్చని మండల వ్యవసాయాధికారి సునీత తెలిపారు. రెండు కేజీల ప్యాకెట్ రూ.220కు లభిస్తుందన్నారు. సత్యవరంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పెసర, మినుము పంటలపై యాజమాన్య పద్ధతులను వివరించారు. రసం పీల్చు పురుగు ఆశించే ప్రమాదం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆరంగి కోటేశ్వరరావు, పలువురు పాల్గొన్నారు.

ఆమదాలవలస ఎస్‌ఐకి బదిలీ

ఆమదాలవలస: ఆమదాలవలస పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న కె.వెంకటేష్‌కు విశాఖపట్నం వీఆర్‌కు బదిలీ చేసినట్లు గురువారం ఎస్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈయన స్థానంలో సరుబుజ్జిలి ఎస్‌ఐగా పనిచేస్తున్న బాలరాజును ఆమదాలవలస ఎస్‌ఐగా నియమించారు. శ్రీకాకుళం వీఆర్‌లో ఉన్న హైమావతిని సరుబుజ్జిలి ఎస్‌ఐగా నియమించినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: సీతపేట ఐటీడీఏ పరిధిలోని టీఎస్పీ ఏరియాలో ఒక మినీ అంగన్‌వాడీ కార్యకర్త, రెండు అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాతపట్నం సీడీపీఓ టి.విమలారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పాతపట్నం మండలంలోని కొనంగిలో మినీ అంగన్‌వాడీ కార్యకరకు బీసీ-బి, చిన్నకింగలో సహాయకురాలకు ఎస్టీ, కొత్త సవరసిద్ధమనుగులో సహాయకురాలు పోస్టుకు ఎస్టీ కేటగిరికి కేటాయించామన్నారు. అంగన్‌వాడీ మినీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు పదో తరగతి పాసై ఉండాలన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన


రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

మెళియాపుట్టి: మండలంలోని కరజాడ నుంచి పలాస మండలం కేశుపురం గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం శంకుస్థాపన చేశారు. రూ.2 కోట్లతో 3 కిలోమీటర్ల మేర ఈ రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలియజేశారు. మాజీ ఎంపీపీ సలాన మోహన్‌రావు, నంబాళ్ల వెంకటరావు, అనపాన రాజశేఖర్ రెడ్డి, భాస్కర్ గౌడ్, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

4న ఆలయ హుండీ లెక్కింపు

పాతపట్నం: ఈ నెల 4న పాతపట్నం నీలమణి దుర్గ ఆలయ హుండీని లెక్కించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు దేవదాయశాఖ, ఆలయ అర్చకులు, భక్తుల సమక్షంలో లెక్కింపు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల భక్తులు లెక్కింపులో డ్రెస్ కోడ్ పాటించి పాల్గొనాలని కోరారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ఆమదాలవలస: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్లందరూ ఫిబ్రవరి 28వ తేదీలోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయం, నెట్ సెంటర్, మొబైల్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించవచ్చన్నారు. పెన్షనర్ల సంఘం అభ్యర్థన మేరకు సబ్ ట్రెజరీ కార్యాలయం కింద గదిలో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించడానికి ప్రత్యేక కౌంటర్‌ను సబ్ ట్రెజరీ అధికారి ఎస్.సువర్ణరాజు ఏర్పాటు చేశారన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపు..
మరింత సులభం



- ప్రతీ విద్యుత్ బిల్లుపై క్యూఆర్ కోడ్
- క్షణాల్లో బిల్లుల చెల్లించేందుకు అవకాశం
- అమలులోనికి వచ్చిన నూతన విధానం
- నరసన్నపేటలో చెల్లింపులు బాగున్నాయంటున్న అధికారులు



విద్యుత్ బిల్లుపై ముద్రించిన క్యూ ఆర్ కోడ్

నరసన్నపేట: విద్యుత్ వినియోగదారులు నెలవారీ విద్యుత్ బిల్లుల చెల్లింపును ఏపీఈపీడీసీఎల్ మరింత సులభతరం చేసింది. పట్టణాల్లో, మండల కేంద్రాల్లో వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు క్యూలో వేచి ఉండాల్సిన అవసరం లేదు. గ్రామాల్లో బిల్ కలెక్టర్ వచ్చేవరకు వేచి ఉండనవసరం లేదు. మీ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు ఉన్నాయా.. లేవా.. నెట్ సదుపాయం ఉందా.. అని చెక్ చేసుకుంటే చాలు. నిలబడిన చోటునుంచే క్షణాల్లో బిల్లులు చెల్లించేవచ్చు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులకు ఈ సదుపాయం అమల్లోకి వచ్చింది. నరసన్నపేట ప్రాంతంలో వినియోగదారులు ఇట్టే అందుకున్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసి విజయవంతం కావడంతో జనవరి నుంచి ఈ పద్ధతిలో బిల్లులు చెల్లించేందుకు మరింత సులభతరం చేసింది. ఈ మేరకు క్యూ ఆర్ కోడ్‌తో బిల్లులు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. దీనిపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు.

ఫోన్ పే, పేటీఎం, జీ పే ద్వారా చెల్లింపులు..

ప్రస్తుతం వినియోగదారులు మీ-సేవా కేంద్రాలు, ప్రత్యేక సర్వీస్ ప్రొవైడర్లు, విద్యుత్ కేంద్రాల్లో ఉన్న కలెక్షన్ సెంటర్లు, గ్రామాల్లోకి వచ్చే ప్రత్యేక బిల్లు కలెక్టర్ల ద్వారా బిల్లులు చెల్లిస్తున్నారు. ఫోన్ పే ద్వారా ఆరు నెలల క్రితం నుంచి అవకాశం వచ్చింది. ఈ పద్ధతుల్లో చెల్లిస్తున్న బిల్లుల మొత్తం సకాలంలో విద్యుత్ సంస్థలకు అందడం లేదనే నెపంతో ఫోన్‌పే ద్వారా చెల్లింపులు నిలిపివేసి, మూడు నెలల నుంచి ఈస్టర్న్ పవర్ గ్రిడ్ యాప్ ద్వారా బిల్లులు చెల్లించాలని విద్యుత్ సంస్థలు నిర్ణయించాయి. ఈ యాప్‌పై అనేక మందికి అవగాహన లేకపోవడంతో బిల్లులు చెల్లింపునకు వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. దీనిని గమనించి ఈపీడీసీఎల్ ఈ తాజా ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. యూపీఐ యాప్‌లైన ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎంల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే బిల్లు మొత్తం వస్తుంది. దీనిని ప్రాసెస్ చేసి బ్యాంక్ ఖాతాకు సీక్రెట్ కోడ్ నమోదు చేస్తే బిల్లులు చెల్లింపు అవుతున్నాయి.

కష్టాలు తీరాయంటున్న వినియోగదారులు

అమ్మయ్యా.. విద్యుత్ బిల్లుల చెల్లింపు ఒక పెద్ద పనిగా ఉండేది. కొన్ని సందర్భాల్లో పనులు మానుకొని వెళ్లాల్సి వచ్చేది. గంటల కొద్దీ లైన్లలో ఉండే వాళ్లం. తాజా ప్రక్రియతో కష్టాలు తీరాయని వినియోదారులు అంటున్నారు. ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బిల్లుపై ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తున్నాం. ఎంతో సమయం కలిసి వస్తుంది. ముఖ్యంగా టెన్షన్ తగ్గుతుంది.

నరసన్నపేట నియోజకవర్గంలో విద్యుత్ సర్వీస్ మీటర్ల వివరాలు..

మండలం	విద్యుత్ మీటర్లు	క్యూ ఆర్ కోడ్‌తో బిల్లులు ఇచ్చిన మీటర్లు
నరసన్నపేట టౌన్	15,928	14,435
నరసన్నపేట రూరల్	15,316	13,872
పోలాకి	22,291	20,959
జలుమూరు	10,359	17,833
సారవకోట	15,926	13,146
హిరమండలం	23,003	19,873
కొత్తూరు	21,208	17,504
మెళియాపుట్టి	16,765	12,409
పాతపట్నం	24,042	20,022
ఆమదాలవలస రూరల్	15,359	13,862
ఆమదాలవలస టౌన్	15,280	14,729
బూర్జ	12,714	11,372
సరుబుజ్జిలి	10,044	8,766
పొందూరు	26,507	24,929

వినియోగించుకోవాలి



విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థమే ఈపీడీసీఎల్ ఈ నూతన ప్రక్రియను అందుబాటులోనికి తీసుకువచ్చింది. మూడు నెలలుగా క్యూ ఆర్ కోడ్‌తో బిల్లులు ఇస్తున్నారు. వీరందరూ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి బిల్లులు చెల్లించాలి. ప్రస్తుతం ఆన్‌లైన్ పేమెంట్లు 65 శాతం వరకు జరుగుతున్నాయి.

– ఇందిర, ఏడీ, నరసన్నపేట

కూటమి పాలనలో నిలిచిన సంక్షేమం

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలల పాలనలో ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సంక్షేమ పథకాలను పూర్తిగా నిలిపివేశారన్నారు. ఇప్పటికే ఉన్న పథకాలను సైతం రద్దు చేసే దిశగా చంద్రబాబు పాలన ఉండటంతో సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కూటమి పాలనలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకానికి అతీగతి లేకుండా పోయిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.1,500 నగదు, తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలు చదివితే అందరికీ రూ.20 వేలు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. మహిళల సంక్షేమం ద్వారానే సామాజిక స్వాతంత్ర్యం సాధ్యమని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మారని, ఆ దిశగానే వివిధ సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అనేక అవకాశాలు కల్పించిన నాయకుడు జగనన్న అని అన్నారు. గత ఏడాది ఆరంభంలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రజల జీవితాల్లో సంక్షేమ పథకాలతో సంక్రాంతి కాంతులు వెదజల్లాయన్నారు. పాతపట్నం నియోజకవర్గంలో సుమారు 95 వేల కుటుంబాలకు సంక్షేమ ఫలాలు అందాయని గుర్తుచేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉమాశంకర్, తదితరులు

పొందూరు: ప్రజలందరికీ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలని లీడ్ బ్యాంక్ జిల్లా అసిస్టెంట్ మేనేజర్ కె.ఉమాశంకర్ అన్నారు. గురువారం బురిడికంచరాంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాపు, సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బ్యాంకు ఖాతా కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పొందూరు ఎస్‌ఐ వి.సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో లోలుగు యూనియన్ బ్యాంక్ మేనేజర్ దుంపల మదన్‌మోహన్‌నాయుడు, వర్క్‌షాప్ ట్రైనర్ దుంపల లక్ష్మణరావు, రీసోర్స్‌పర్సన్స్ ఎస్.హరి, ఎ.హరనాథ్, బ్యాంకు ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం: ఈ నెల 3వ తేదీన స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టెక్కలి ఈఈ జి.శంకరరావు గురువారం తెలిపారు. పాతపట్నం 33 కేవీ ఫీడర్ పరిధిలో ఎన్‌హెచ్-326 రోడ్డు క్రాసింగ్ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 2 గంటలకు పాతపట్నం, బూరగాం, కాగువాడ, కొరసవాడ, బోరుభద్ర, గురండి, బగదల, కాపుగోపాలపురం, సీతారాంపల్లి, చంగుడి, సరాలి, తిడ్డిమి, రంకిణి, సూర్యనారాయణపురం, దాసుపురం, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఆమదాలవలస పట్టణంలో..

ఆమదాలవలస: ఈ నెల 3న పట్టణంలోని 33/11 కేవీ సబ్-స్టేషన్ పరిధి మెట్టక్కివలస టౌన్-2 ఫీడర్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించనున్నారు. ఈ మేరకు ఈఈ పైడి యోగేశ్వరరావు గురువారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మెట్టక్కివలస, అమ్మానగర్, కుప్పిలి వారి వీధి, ఊసవానిపేట, అలమాజీపేట, వాటర్ పంపు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

రోడ్డు పక్కనే పెంటకుప్ప



సారవకోట మండలంలోని బద్రి నుంచి బుడితి వెళ్లే రోడ్డు పక్కన లక్ష్మీపురం గ్రామానికి సమీపంలో పెంటకుప్పతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పెంటకుప్పపై ఉన్న చెత్త రోడ్డుపైకి ఎగిరి వాహనదారుల కళ్లల్లో పడుతుంది. పెంటకుప్పను తొలగించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. – సారవకోట

స్టడీ చైర్ల పంపిణీ



సారవకోట మండల కేంద్రంలోని సమీకృత వసతిగృహం విద్యార్థులకు గురువారం స్టడీ చైర్లు, అట్టలు పంపిణీ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విరాళాల రూపంలో రూ.20 వేలను సేకరించారు. ఈ మొత్తంతో స్టడీ చైర్లు, అట్టలను ఎంఈఓ-2 భూలక్ష్మి, సారవకోట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. అలుదు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తంప రామారావు, వార్డెన్ మోహన్‌రావు ఉన్నారు. – సారవకోట

నిరసన..



కొత్తూరు మండలం నివగాం గ్రామ ఆర్టీసీ కాంప్లెక్స్ లీజును రద్దు చేసే అంతవరకు పోరాటం ఆగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్ వద్ద పాలకొండ-హడ్డబంగి రోడ్డులో గురువారం నిరసన చేపట్టారు. కాంప్లెక్స్‌ను పదేళ్లపాటు ప్రైవేట్ వ్యక్తులకు లీజుకు ఇవ్వడం దారుణమన్నారు. ఈ విషయంలో పాతపట్నం ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. – కొత్తూరు

ప్రమాదకర మలుపు..



హిరమండలంలోని అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో గల పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. పలుసార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలున్నాయి. మలుపు వద్ద వేగ నియంత్రణకు సంబంధించిన సూచిక బోర్డులు లేవు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – హిరమండలం

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన


తెలగవలసలో నగర సంకీర్తన నిర్వహిస్తున్న సీతారామ భజన మండలి సభ్యులు

నరసన్నపేట: ధనుర్మాసం పురస్కరించుకుని మండలంలోని తెలగవలస, నారాయణవలసల్లో ఏటా మేలుకొలుపులు నిర్వహిస్తున్నారు. తెలగవలసలో గొల్లంగి కృష్ణారావు ఆధ్వర్యంలో సీతారామ భజన బృందం నగర సంకీర్తన చేస్తున్నారు. దీంట్లో మహిళలు కూడా పాల్గొంటున్నారు. నారాయణవలసకు చెందిన అభయాంజనేయ భజన బృందం సభ్యులు శిమ్మ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పరిసర గ్రామాల్లో మేలుకొలుపులు నిర్వహిస్తున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ రాంబాబు

హిరమండలం: ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించాలని ఈశ్వరీయ బ్రహ్మకుమారి సుధారాణి అన్నారు. హిరమండలంలోని విశ్వకల్యాణ భవనంలో గురువారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ కె.రాంబాబు విచ్చేశారు. లోక కల్యాణం కోసం ఈశ్వరీయ బ్రహ్మకుమారీలు చేసే కృషి అభినందనీయమన్నారు. హిరమండలం ఏఎస్‌ఐ, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

వితంతు పింఛన్లు మంజూరు చేయాలి

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో జులై నుంచి నవంబర్ వరకు వితంతు పింఛన్లు ఎందువల్ల మంజూరుకాలేదని అధికారులను వార్డు సభ్యులు ప్రశ్నించారు. గురువారం సాయంత్రం ఈఓ ద్రాక్షాయిని ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. డిసెంబర్‌కు సంబంధించిన వితంతు పింఛన్లు జనవరిలో మంజూరయ్యాయని వార్డు సభ్యుడు ఆర్.శ్రీధర్, తదితరులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే మంజూరు చేస్తున్నామని, అక్టోబర్ కంటే ముందు ఎంత మంది దరఖాస్తు చేసుకున్నారో వివరాలు తీసుకుని, అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఎంపీడీఓ మధుసూదనరావు అన్నారు. గ్రామ సభకు పలు శాఖల అధికారుల గైర్హాజరు కావడం పట్ల వార్డు సభ్యులతోపాటు స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్న సైజులో గుడ్లు వస్తున్నాయని, కరిగిపోయినవి ఇస్తున్నాయని సభ దృష్టికి లబ్ధిదారులు తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, ఎంఈఓ శాంతారావు, వార్డు సభ్యులు ఇప్పిలి నీలంరాజు, మాజీ ఎంపీటీసీ జామి వెంకటరావు, పీస కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ ప్రారంభం

నరసన్నపేట: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ గురువారం ప్రారంభమైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.20.53 కోట్ల మేరకు వివిధ శాఖల్లో పనులు నిర్వహించారు. ఈ పనులు ఏ మేరకు జరిగాయి, ఏమైనా అవినీతి జరిగిందా అనేదానిపై సోషల్ ఆడిట్ చేస్తున్నారు. ఈ మేరకు గ్రామాల్లోనికి సోషల్ ఆడిట్‌ను 10 బృందాలు చేస్తున్నాయని ఎస్‌ఆర్పీ రామారావు తెలిపారు. ఆడిట్ వివరంగా చేపట్టాలని సూచించారు. 34 పంచాయతీల్లో ప్రారంభమైందన్నారు. గ్రామాల్లో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు సహకరించాలని కోరారు. వారం రోజులపాటు ఆడిట్ జరుగుతుందన్నారు.

న్యాయవాదుల నిరసన


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కొత్తూరు: న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరుతూ స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ అనంతపురం జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది మృతికి కారకులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అప్పారావు, సుధాకరరావు డిమాండ్ చేశారు. న్యాయవాదులకు రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది రాడ రాజు, న్యాయవాదులు ధర్మారావు, ఫల్గుణరావు, హరిబాబు, కృష్ణారావు, ప్రసాదరావు, యజ్ఞేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

6న నుంచి నిరుద్యోగ యువతకు శిక్షణ

పాతపట్నం: ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు పాతపట్నంలోని ఆల్ ఆంధ్ర రోడ్డు సమీపంలోని మహేంద్ర డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ యువతకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంకల్ప ప్రాజెక్టులో భాగంగా ఔత్సాహిక పారిశ్రామికులకు శిక్షణ తరగతులు ఇస్తున్నామని, అభ్యార్థులకు పరిశ్రమల స్థాపన, పరిశ్రమల అనుమతులు, ముద్ర, పీఎంఈజీపీ రుణాలపై అవగాహన కల్పించి, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 8317652552ను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న రామరాజు, తదితరులు

కొత్తూరు: స్థానిక కేజీబీవీలో ఇటీవల నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాతపానుటూరు యూపీ పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. హరిణి, శ్రావ్య, హిమబిందును గురువారం రామరాజు చారటబుల్ ట్రస్టు చైర్మన్ పారిశెల్లి రామరాజు అభినందించారు. విద్యార్థులకు నగదుతోపాటు జ్ఞాపికలను అందజేశారు. గైడ్‌గా వ్యవహరించిన రాజేష్, హెచ్‌ఎం కృష్ణారావును సత్కరించారు.

పాఠశాలల అభివృద్ధిలో ఎస్‌ఎంసీలే కీలకం


నరసన్నపేట: మాట్లాడుతున్న ఏఎంఓ జనార్దనరావు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలలను మరింతగా బలోపేతం చేయాలని, ఈ దిశగా ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఏఎంఓ జనార్దనరావు అన్నారు. స్థానిక ప్రైవేట్ స్కూల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 83 ప్రభుత్వ స్కూళ్లకు చెందిన చైర్మన్‌లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు. ఏఎంఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సదుపాయాలు కల్పిస్తున్నా విద్యార్థుల సంఖ్య ఆశించిన స్థాయిలో పెరగడం లేదన్నారు. ఎస్‌ఎంసీల పనితీరు, చేపట్టాల్సిన బాధ్యతలు, ఉపాధ్యాయుల విధులు తదితర అంశాలను వివరించారు. వమరవల్లి డైట్ నుంచి వచ్చిన పరిశీలకులు జి.వి.రమణ, ఏపీఓ నళినీకాంత్, ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు, డీఆర్పీలు టి.సుధీర్, బి.తవుడు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల సమగ్రాభివృద్ధికి ఎస్‌ఎంసీలే కీలకమని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎంఈఓలు గోవిందరావు, శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలు, కమిటీ చైర్మన్లకు శిక్షణ ఇచ్చారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

జలుమూరులో..

జలుమూరు: విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ, వ్యక్తిగత శుభ్రతపై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని, పాఠశాలల అభివృద్ధికి ఎస్‌ఎంసీలు కృషి చేయాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లకు శిక్షణ ఇచ్చారు.

పొందూరులో..

పొందూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఎస్‌ఎంసీలు కీలక బాధ్యత పోషించాలని ఏఎంఓ పి.ప్రభాకర్‌రావు, ఎంఈఓ-1 రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో ఎస్‌ఎంసీ చైర్మన్‌లు, హెచ్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ-2 పట్నాన రాజారావు, డీఆర్పీలు జి.మధుబాబు. పి.తేజేశ్వరరావు, జి.వి.రమణ పాల్గొన్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: స్థానిక ఎమ్మార్సీలో ఎస్‌ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలకు ఎంఈఓలు శ్యామసుందరావు, బి.ధనుంజయరావు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: పాఠశాలల అభివృద్ధికి ఎస్‌ఎంసీలు సహకరించాలని ఎంఈఓ రాంబాబు కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శిక్షణ నిర్వహించారు. ఎంఈఓ-2 గొల్లవాడు, తహసీల్దార్ హనుమంతరావు, డీఆర్పీ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

పొందూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అసిస్టెంట్ కుక్ పోస్టుకు అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. మండలంలోని వావిలపల్లి మోడల్ స్కూల్‌కు సంబంధించిన బాలికల వసతి గృహంలో ఔట్ సోర్సింగ్ విధానంలో అసిస్టెంట్ కుక్‌ను నియమించనున్నారు. 26 మంది మహిళా అభ్యర్థులకు తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు, ఎంపీడీఓ మన్మధరావు, ఎంఈఓ రాజేంద్రప్రసాద్ ఇంటర్వ్యూ నిర్వహించారు.

పరామర్శ..


బొడ్డేపల్లిపేటలో బెండి వీరభద్రరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని పలు కుటుంబాలను మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు తమ్మినేని సీతారాం గురువారం పరామర్శించారు. బొడ్డేపల్లిపేట వార్డులో బెండి వీరభద్రరావు తల్లి, ఆమదాలవలస గేటు వార్డుకు చెందిన జల్లేపల్లి రామారావు తల్లి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాలను తమ్మినేని పరామర్శించారు. పరామర్శించిన వారిలో అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు ముత్తా విజయ్, పార్టీ నాయకులు మామిడి రమేష్, కూన రామకృష్ణ, పొదిలాపు తిరుపతి, సాధు చిరంజీవి, సనపల రాజు, తదితరులు ఉన్నారు.